# అత్తగారు

పూర్వం హస్తినాపురమనే నగరంలో శివదత్తుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు మంచి భాగ్యవంతుడు. అతనికి ఒక్కడే ఒక్క కుమారుడు. అతని పేరు వసుదత్తుడు.

వసుదత్తుడు చిన్నతనంలోనే వేదాలు, శాస్త్రాలు అభ్యసించి మంచిపేరు తెచ్చుకున్నాడు. అతనికి యుక్త వయస్సు వచ్చింది. శివదత్తుడు బాగా విచారించి, ఒక కలవారియింటి అమ్మాయిని కొడుక్కి వివాహం చేసుకొన్నాడు. ఆ అమ్మాయి కాపురానికి వచ్చింది.

శివదత్తుడి భార్య పట్టిగయ్యాళి గంప. పరమ మూర్ఖురాలు. మహా తామసం. కొడుకు కోడలు చక్కగా చిలుక గోరువంకల్లాగా ఆడుకుంటూ, పాడుకొంటూ ఉంటాంటే ఆమె సహించలేకపోయింది. రోజూ కోడలితో యుద్ధమే. ఇదంతా చూడలేక శివదత్తుడు చెప్పకుండా దేశాల పాలైపోయాడు. వసుదత్తుడు, భార్యతో కలిసి తల్లి కోపం చల్లార్చటాని కన్నివిధాల ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరైనాయి. అత్తగారి యీ పోరుపడలేక వసుదత్తుడు భార్య మాయమైపోయింది. ఆ విచారంతో వసుదత్తుడు కూడ ఇల్లు వదలి పోవటాని కుద్యమించాడు. అప్పుడిరుగు పొరుగువాళ్లు జాలి దలచి, మరో పిల్లను తెచ్చి అతనికిచ్చి పెండ్లిచేసి, మరోసారి ఒక యింటివాణ్ణి చేశారు.

ఇప్పటికైనా అత్తగారికి మనసు మారలేదు. ఆమె తన స్వభావసిద్ధమైన దౌష్ట్యంతోనే ఈ కోడల్ని హింసించటం మొదలుపెట్టింది. పాపమా రెండో కోడలు ఈ హింసా కాండ భరించలేక ఒకనాడు రహస్యంగా ఉరితీసికొని చచ్చింది. వసుదత్తుడెంతో దుఃఖించాడు. ఇల్లు వాకిలి వదలిపోదామనే విరక్తిభావం కలిగిందాతనికి. ఈ మారు కూడా ఇరుగు పొరుగువాళ్లు అడ్డుపడ్డారు. తండ్రి, కొడుకు లిద్దఱు ఇల్లు వీడి పోతే ఎలాగన్నారు. మళ్లీ పెళ్లి చేయాలని ప్రయత్నించారు. కాని వసుదత్తుడు మాత్రం అంగీకరించలేదీమారు.

**బొడ్డుపల్లి హనుమాయమ్మ**

తనగతి ఏమిటా ! అని వసుదత్తుడెంతో విచారించాడు. అంతలో ఒక అద్భుతమైన ఆలోచన తట్టిందతనికి. సమర్థుడైన ఒక శిల్పిచేత దారువుతో ఒక రమణీయమైన స్త్రీ బొమ్మ చెక్కించాడు. తాను రహస్యంగా పెండ్లి చేసికొన్నట్లు ఆ అమ్మాయికి చాలా బిడియమని, అందువల్ల ఎప్పుడు గదివదలి పెట్టి రాదని బాగా ప్రచారం చేశాడు. చెక్కబొమ్మను ఒక గదిలో పెట్టి తాళం వేశాడు. అక్కడ ఒక దాసీ దాన్ని కాపలాపెట్టాడు. వసుదత్తుడు కడకు తనతల్లిని గూడా గదిలోకి పోనీలేదు. "అమ్మా! ఇక నీ కొత్త కోడలితో ఏ మాత్రం సంబంధం లేకుండా ఉండాలి. దానికి ఇంటిపనులేమీ చేయటం చేతకాదు. నీవు దానిగదిలోకి వెళ్లక్కర్లేదు. దాన్ని చూడక్కర్లేదు." అని మొగమోటం లేకుండా చెప్పాడు వసుదత్తుడు తల్లికి. తల్లి ఈమాటలు నమ్మింది. కొత్తకోడలు జోలి లేకుండా ఆమెను చూడకుండా చాలారోజులు గడిచాయి.

ఇట్లా ఉంటుండగా, ఒకనాడు దొడ్లోనుండి పెద్దకేక వినిపించింది. వసుదత్తుడి తల్లి ఱాతితో తల మోదుకుంది. రక్తం జలజల కారుతున్నది. వసుదత్తుడు, చుట్టుప్రక్కల అమ్మలక్కలు, అయ్యలు ప్రోగైనారు. వారంతా కారణం విచారించారు. తన కొత్తకోడలు, నిష్కారణంగా తన్ను ఱాతితో మోదిందని చెప్పిందత్తగారు. అందఱు ఆశ్చర్యపోయారు. 'బలేభార్యను సంపాదించావయ్యా!' అని అందఱు వసుదత్తుడ్ని నిందించారు. అందఱు ఆమెను చీవాట్లు పెట్టాలని గదిలోకి దూకుడుగా పోయారు. అక్కడ అందమైన దేవదారు బొమ్మమాత్రం ఉంది. అందఱు ఆశ్చర్యపడ్డారు. అత్తగారి గయ్యాళితనానికి ముక్కున వేలువేసుకొన్నారు. వసుదత్తుడు ఇక తన కింట్లో సుఖం లేదని ఇల్లు వదలిపోయాడు. ఈమారు అడ్డగించినవాళ్లేలేరు.

(కథాసరిత్సాగరం నుండి)